క్లుప్తంగా

ఘనంగా జీవేశ్వరస్వామి జయంతి



ఆత్మకూర్: జీవేశ్వరస్వామి జయంతి వేడుకలను శనివారం పట్టణంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్థానిక నేతాజీనగర్‌లోని ఆంజనేయస్వామి ఆలయంలో జీవేశ్వరస్వామి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం హోమం, అభిషేకం, భజన తదితర పూజా కార్యక్రమాలు వేదపండితుల ఆధ్వర్యంలో నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో జిందెదశరథ్‌రావు, విఠల్‌రావు, మీనాబాయ్, కృష్ణయ్య, సందీప్, విశ్వనాథ్, విష్ణురామ్, శ్రీను, జ్యోతి భక్తులు తదితరులు పాల్గొన్నారు.

అందరి భాగస్వామ్యంతోనే పాఠశాల అభివృద్ధి



పెబ్బేరు రూరల్: అందరి భాగస్వామ్యంతోనే పాఠశాల అభివృద్ధి చెందుతుందని ఎంఈఓ జయరాములు తెలిపారు. శనివారం మండల కేంద్రంలోని చెంచువాడ ప్రాథమిక పాఠశాలలో తల్లిదండ్రుల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు తల్లిదండ్రులు ప్రతి నెల ఒక్కసారైనా పాఠశాలను సందర్శించి విద్యార్థుల ప్రగతిపై, ఉపాధ్యాయుల పని తీరు, సమస్యల పరిష్కారం కోసం ఉపాధ్యాయులతో చర్చించాలన్నారు. మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యవంతమైన భోజనం అందించాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం చిన్న రాములు, చైర్‌పర్సన్ పార్వతి పాల్గొన్నారు.

యువజన కాంగ్రెస్ ఎన్నికల్లో పాల్గొనండి



ఆత్మకూర్: యువజన కాంగ్రెస్ ఎన్నికల్లో యువత పెద్ద ఎత్తున పాల్గొనాలని నియోజకవర్గ అధ్యక్షుడు తులసిరాజ్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ జిల్లాకార్యదర్శి రహ్మతుల్లా, పరమేష్ అన్నారు. శనివారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారుమాట్లాడారు. యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడి స్థానానికి పిన్నంచర్ల హరీష్‌గౌడ్, ఖానాపూర్ వంశీ, తిప్పడంపల్లి భాస్కర్, ఆరేపల్లి రవి, పిన్నంచర్ల కృష్ణ పోటీలో ఉన్నారని తెలిపారు. ఈ నెల 14 నుంచి సెప్టెంబర్ 14 వరకు ఎన్నికల్లో ఐవైసీ యాప్‌లో క్రమసంఖ్య ఓటువేసి గెలిపించాలని కోరారు.

పంచాయతీ కార్యదర్శికి సన్మానం

ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలో పనిచేసే పంచాయతీ కార్యదర్శి రవితేజను శనివారం పలువురు నాయకులు సన్మానించారు. ఈ నెల 15న ఉత్తమ కార్యదర్శిగా ఆయన కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు. ఆశన్న, గోపి, వెంకటరమణ, గోపాల్, శ్రీను, వడ్డె శాంతయ్య, రాంచంద్రయ్య, రాజు తదితరులు పాల్గొన్నారు.

నల్లచెరువు అలుగుకు తాత్కాలిక మరమ్మతు

పెబ్బేరు రూరల్: మండలంలోని సూగూరు నల్లచెరువును గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. చెరువులో నుంచి నీళ్లు వృథాగా నదిలోకి వెళ్తుండడంతో ఆయకట్టు రైతులు కొత్త సూగూరు మాజీ సర్పంచ్ వెంకటేష్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన సమస్యను పీజేపి ఇరిగేషన్ ఏఈ కిశోర్‌కు వివరించారు. నీళ్ల ఎక్కువగా ఉండంతో జేసీబీ సహాయంతో మట్టికట్ట వేసి తాత్కాలిక మరమ్మతు చేశారు. ఏటా దుండగులు ఇలాగే చేస్తుంటారని, అలుగుకు శాశ్వత పరిష్కారం చూపాలని అధికారులకు రైతులు విన్నవించారు.

చెత్త తొలగించండి



పాన్‌గల్: మండల కేంద్రంలోని బీసీ కాలనీలో ఇటీవల పంచాయతీ కార్మికులు మురుగు కాల్వలను శుభ్రం చేసి కాల్వలోని చెత్త, మట్టిని తొలగించి రోడ్డుపైనే వదిలేశారు. దీంతో పాటు ఖాళీ స్థలాలు, రోడ్డు పక్కన ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలను తొలగించకపోవడంతో దోమల వృద్ధితో పాటు విషసర్పాలు సంచారిస్తున్నాయని కాలనీ వాసులు వాపోతున్నారు. ప్రధాన రహదారి పరిసరాల్లో మాత్రమే పారిశుద్ధ్య చర్యలు నిర్వహిస్తూ కాలనీల్లో నిర్వహించడంలేదనే విమర్శలు ఉన్నాయి. పంచాయతీ సిబ్బంది స్పందించి చెత్త, ఖాళీ స్థలాల్లో పేరుకపోయిన పిచ్చి మొక్కలను తొలగించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

నిబంధనలు పాటించాల్సిందే..



కొత్త బండరావిపాకుల వద్ద వాహనదారులకు డ్రంకెన్ డ్రైవ్ టెస్టు చేస్తున్న పోలీసులు (ఫైల్)

- ట్రాఫిక్ నిబంధనలపై కఠినంగా వ్యవహరిస్తున్న పోలీసులు
- ఇటీవల రెండు వాహనాలకు భారీ జరిమానా

గోపాల్‌పేట: గతంలో ట్రాఫిక్ రూల్స్ పాటించకుండా వాహనాలు నడిపితే పోలీసులు వాహనాలు నిలిపి సంబంధిత పత్రాలు అడిగి ఏఏ పత్రాలు లేవో వాటికి జరిమానా వేసేశారు. ఇప్పుడు ఫొటోలు తీసి జరిమానా వేసి ఈ–చలాన్లు ఇంటికే పంపుతున్నారు. ప్రస్తుతం వాహనదారులు నంబర్ ప్లేటు ఉన్నా దానికి కలర్ రుద్దడం, కనిపించకుండా ఇతర పనులు చేయడం లేదంటే, నంబర్‌ప్లేట్ తీసి వేయడం వంటి పనులు చేస్తున్నారని పోలీసులు కఠిన నిర్ణయాలు తీసుకుంటున్నారు. నంబర్‌ప్లేటు లేకున్నా ఇతర కారణాల వల్ల వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించకుంటే భారీఎత్తున జరిమానా వేస్తామని హెచ్చరిస్తున్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదని, వాహనాల వెంట అన్ని పేపర్లు పెట్టుకుని లైసెన్స్ ఉన్నవారు మాత్రమే వాహనాలు నడపాలని చెబుతున్నారు. హెల్మెట్ వాడకపోవడం, డ్రంకెన్ డ్రైవ్, మైనర్లకు వాహనాలు ఇవ్వడం, నంబర్ ప్లేటు కనిపించకుండా చేయడం, వాహనాల పత్రాలు లేకుండా తిరగడం వంటివి చేస్తే కఠిన చర్యలు తప్పవని చెబుతున్నారు. ఇటీవల ఇద్దరు ద్విచక్ర వాహనదారులు నంబరు ప్లేటు కనిపించకుండా చేసినందుకు గోపాల్‌పేట పోలీసులు ఆర్టీఏ అధికారుల వద్దకు పంపగా ఓ వాహనదారుడికి రూ. 5,600 మరొకరికి రూ.2వేల జరిమానా విధించారు.

జరిమానాలు ఇలా..

వాహనదారులు చేసే తప్పుల ఆధారంగా పోలీసులు చలాన్లు విధిస్తున్నారు. మద్యం తాగి వాహనం నడిపితే రూ.2వేల వరకు, సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేస్తే రూ.వెయ్యి వరకు, నంబర్‌ప్లేట్ లేకుంటే రూ.200, లైసెన్స్ లేకుండా వాహనం నడిపితే రూ.500, ఓవర్ లోడ్‌తో వెళితే రూ.వెయ్యి, ఇన్సూరెన్స్ లేకుంటే రూ.వెయ్యి, హెల్మెట్ లేకుండా వాహనం నడిపితే రూ.200, మైనర్లు వాహనాలు నడిపితే రూ.వెయ్యి వరకు జరిమానా వేయడంతో పాటు చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరిస్తున్నారు.

4,552 వాహనాలు జరిమానా

మండలంలో ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకు మొత్తం 4,552 వాహనాలకు రూ.2,55,000 జరిమానా విధించారు. అలాగే రేవల్లి మండలంలో ఈ సంవత్సరం మొదటి నుంచి ఇప్పటివరకు 470 చలాన్లు, 42 డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదు చేశామని మొత్తం రూ.1.04లక్షల జరిమానా విధించినట్లు రేవల్లి ఎస్‌ఐ రాము తెలిపారు. వాహనాలకు వేసిన ఫైన్ డబ్బులు తప్పనిసరిగా కట్టాల్సిందేనని మరోసారి వాహనాలను పోలీసులు నిలిపినప్పుడు జరిమానా ఉంటే తప్పకుండా కట్టాల్సి వస్తుందని పోలీసులు చెబుతున్నారు.

అవగాహన కల్పించాలి



పోలీసులు వాహనదారులకు ట్రాఫిక్ రూల్స్‌పై ఎప్పటికప్పుడు అవగాహన కల్పిస్తే బాగుంటుంది. చాలామంది తెలియకపోవడం వల్ల హెల్మెట్లు ధరించడం లేదు. ప్రమాదాలు, జరిమానాల గురించి ఎక్కువ సార్లు అవగాహన కల్పించడం ద్వారా చాలామందికి తెలుస్తుంది.

– రాజేష్‌చారి, ఏదుట్ల

నిబంధనలు పాటించాలి



వాహనదారులు తప్పనిసరిగా నిబంధనలు పాటించాల్సిందే. కొంత మంది నంబరు ప్లేటు ఉన్నా కనిపించకుండా కలర్ వేయడం, లేదంటే నంబర్ ప్లేటు వంచడం వంటి పనులు చేస్తున్నారు. దీనివల్ల చాలా ఇబ్బందులు తలెత్తుతాయి. ఇటీవల రెండు వాహనాలు ఆర్టీఏ అధికారికి వద్దకు పంపగా ఒకరికి రూ.5,600, ఇంకొకరికి రూ.2వేల జరిమానా రాశారు. ట్రాఫిక్ రూల్స్ పాటించడం వల్ల అందరికీ మేలు కలుగుతుంది.

– హరిప్రసాద్, ఎస్‌ఐ, గోపాల్‌పేట

వైద్యులకు రక్షణ కల్పించాలి



వనపర్తిలో ధర్నా చేస్తున్న ఏబీవీపీ నాయకులు

వనపర్తిటౌన్: ఏబీవీపీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో ర్యాలీ నిర్వహించి, స్థానిక రాజీవ్‌చౌక్‌లో ధర్నా చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బాలకృష్ణ మాట్లాడుతూ.. హత్యాచారానికి పాల్పడిన, అందుకు సహకరించిన వారిపై చర్యలు తీసుకుని కఠినంగా శిక్షించాలన్నారు. కార్యక్రమంలో గణేష్, కార్తీక్, రాజేందర్, పవన్, రమ్య, ప్రణీత తదితరులు పాల్గొన్నారు.



ఆత్మకూర్‌లో నిరసన తెలుపుతున్న వైద్యులు, సిబ్బంది

ఆత్మకూర్: దేశవ్యాప్తంగా వైద్యులు, సిబ్బందికి రక్షణ లేకుండా పోయిందని, కలకత్తా ఘటనలో నిందితులను కఠినంగా శిక్షించాలని డాక్టర్ వల్లభ్‌దాస్ రాఘవేందర్‌గౌడ్ అన్నారు. శనివారం అమరచింత, ఆత్మకూర్ మండలాల వైద్యులు, డయోగ్నస్టిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పట్టణంలో ర్యాలీ నిర్వహించి గాంధీచౌక్‌లో కొవ్వొత్తులతో నిరసన తెలిపారు. వైద్య విద్యార్థినిపై హత్యాచారానికి పాల్పడ్డ నిందితులను కఠినంగా శిక్షించాలని భవిష్యత్‌లో వైద్యులు, సిబ్బందిపై ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠినమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వైద్యులు ప్రశాంత్, ముజీబురహ్మాన్, అనిల్, తిలక్‌గౌడ్, శ్రీనివాసులు, బాబ్జీ, శ్యామ్, రాజేష్, వెంకటేష్, రాజ్‌కుమార్, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.



పాన్‌గల్ పీహెచ్‌సీ ఎదుట..

కఠినంగా శిక్షించాలి

పాన్‌గల్: వైద్య విద్యార్థిపై హత్యాచారానికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని శనివారం పాన్‌గల్ పీహెచ్‌సీ సిబ్బంది నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్లు నాగరాజు, శ్రీకాంత్, కురుమూర్తి, శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

వేగవంతంగా గిడ్డంగి నిర్మాణం



చివరి దశకు చేరుకున్న గిడ్డంగి నిర్మాణం

అమరచింత: మండలంలోని ధర్మాపురం శివారులో 10వేల మెట్రిక్ టన్నుల ధాన్యం నిల్వ చేసుకునేందుకు వీలుగా గతేడాది శంకుస్థాపన చేయగా, పనులు వేగవంతంగా పూర్తి కావస్తున్నాయి. మరో 15 రోజుల్లో పనులు పూర్తి చేసి ప్రారంభోత్సవానికి సిద్ధం చేస్తున్నట్లు గిడ్డంగుల శాఖ అధికారులు తెలిపారు. గతేడాది గిడ్డంగుల శాఖ చైర్మన్‌గా ఉన్న దివంగత సాయిచంద్ తన స్వగ్రామమైన అమరచింతలో గోదాం నిర్మించేందుకు రూ.10కోట్లను మంజూరు చేయడంతో, పది ఎకరాల ప్రభుత్వ స్థలంలో నిర్మాణం చేస్తున్నారు. శంకుస్థాపన చేసిన 20 రోజుల వ్యవధిలోనే సాయిచంద్ మృతి చెందడంతో ఇది కలగానే మిగిలిపోతుందనుకున్నారు. ముందస్తుగా నిధులు మంజూరు కావడంతో వేగవంతంగా పనులను ఏడాది కాలంలోనే పూర్తి చేయడానికి సదరు కాంట్రాక్టర్‌పై అధికారులు ఒత్తిడి పెంచి పూర్తి చేశారు.

రైతులకు ఎంతో ఉపయోగం..

రైతులు పండించిన ధాన్యంతో పాటు ప్రభుత్వ పరంగా రైతులకు సరఫరా చేయాల్సిన విత్తనాలను సైతం వీటిలో భద్రపరుచుకునేందుకు ఉపయోగపడుతుందని అధికారులు వెల్లడిస్తున్నారు. సీజన్‌లేని సమయంలో, గిట్టుబాటు ధరలేనప్పుడు రైతులు ధాన్యాన్ని నిల్వ ఉంచుకునేందుకు దోహదపడుతుండటంతో అమరచింత, నర్వ మండలాల రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ఘనంగా సర్దార్ సర్వాయిపాపన్న జయంతి

పెద్దకొత్తపల్లి: మండలంలోని జై గౌడ సంఘం ఆధ్వర్యంలో శనివారం సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా విభాగం అధ్యక్షురాలు సోమ ప్రగతిగౌడ్, నాయకులు హరీష్‌గౌడ్ లు పాపన్నగౌడ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు యుగంధర్ గౌడ్, ప్రధాన కార్యదర్శి చక్రధర్ గౌడ్, సత్యంగౌడ్, వంశీగౌడ్, లలితారాణి, సుగుణమ్మ, లింగస్వామి గౌడ్, గోపిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రిలో కాన్పులు సురక్షితం

పాన్‌గల్: సురక్షిత కాన్పుల కోసం ప్రభుత్వ ఆస్పత్రిలోనే వైద్యం చేయించుకోవాలని పీహెచ్‌సీ డాక్టర్ చంద్రశేఖర్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో గర్భిణి చంద్రకళ ఇంటికి వెళ్లి ఆమె ఆరోగ్య సమాచార వివరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లి డబ్బులను వృథా చేసుకోవద్దని ప్రభుత్వ ఆస్పత్రులలో అన్ని రకాల వసతులు ఉన్నాయని తెలిపారు. పీహెచ్‌సీలో సాధారణ కాన్పులు అవుతున్నాయని అవగాహన కల్పించారు. కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ రామయ్య, వైద్య సిబ్బంది ఉన్నారు.



గర్భిణి ఆరోగ్య సమాచారాన్ని పరిశీలిస్తున్న వైద్యులు

సెల్‌ఫోన్ అప్పగించిన పోలీసులు

ఆత్మకూర్: సీఈఐఆర్ పోర్టల్ ద్వారా బాధితుడి చోరీకి గురైన సెల్‌ఫోన్‌ను రికవరీ చేసి శనివారం అప్పగించినట్లు ఎస్‌ఐ నరేందర్ తెలిపారు. పట్టణానికి చెందిన చిన్ని మధు మార్చి 18వ తేదీన కిరాణషాపులో సరుకులు తీసుకుంటున్న క్రమంలో తన ఫోన్ కనిపించకుండా పోయింది. బాధితుడి ఫిర్యాదు మేరకు పోర్టల్ ద్వారా సెల్‌ఫోన్ ఆచూకీ కనుగొని అప్పగించినట్లు తెలిపారు.

ఆర్థికసాయం అందజేత

పెబ్బేరు రూరల్: మండలంలోని వైశాఖాపురం చెందిన పుట్ట ఉసేన్ అనారోగ్యంతో మృతి చెందాడు. మత్స్యసహకార సంఘం తరపున అధ్యక్షుడు చెన్నయ్య, కార్యదర్శి గువ్వలకతాల్ శనివారం మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వారి కుటుంబసభ్యులకు రూ.10వేల ఆర్థికసాయం అందించారు.

శాగాపూర్‌లో లోపించిన పారిశుద్ధ్యం



పాన్‌గల్: మండలంలోని శాగాపూర్‌లో ఏ కాలనీలో చూసిన మురుగు నిల్వలతో పారిశుద్ధ్యం లోపించింది. డ్రైయినేజీ వ్యవస్థ, ఇంకుడు గుంతలు లేకపోవడంతో మురుగు ఇళ్ల ముందే నిల్వ ఉండటంతో దోమలు వృద్ధి చెందడం, మురుగు నిల్వలో పందుల సంచారం, దుర్వాసనతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు గ్రామస్తులు వాపోతున్నారు. పంచాయతీ సిబ్బంది మురుగు నిల్వలు లేకుండా చూడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

రుణమాఫీ కోసం రైతుల ధర్నా

పెబ్బేరు రూరల్: మండలంలోని గుమ్మడంలో రైతు వేదిక వద్ద రుణమాఫీ కోసం శనివారం రైతులు నిరసన తెలిపారు. రైతు సంఘం నాయకులు ఈ సందర్భంగా ఏఈఓ ప్రశాంత్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం నిర్దేశించిన గడువు లోపు తాము గుమ్మడం గ్రామంలోని గ్రామీణ వికాస్ బ్యాంకులో రూ.2 లక్షల పంట రుణాలు తీసుకుని, సకాలంలో రెన్యూవల్ చేశామని తెలిపారు. రుణమాఫీకి కావాల్సిన అన్ని అర్హతలు ఉన్నా కూడా ప్రభుత్వం ప్రకటించిన 3వ జాబితాలో మా పేర్లు లేవని ఆవేదన వ్యక్తం చేశారు. పంట రుణం తీసుకున్న ప్రతి రైతుకు ఎలాంటి షరతు లేకుండా రుణాలు మాఫీ చేయాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సత్యంయాదవ్, పాలెం శ్రీనివాసులు, నాగేషు, రైతులు పాల్గొన్నారు.



అమరచింతలో నిరసన తెలుపుతున్న రైతులు, నాయకులు

అమరచింత: షరతులతో సంబంధం లేకుండా రైతులకు రూ.2లక్షల రుణం వెంటనే మాఫీ చేయాలని రైతుకూలీ సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో యూనియన్ బ్యాంకు ఎదుట శనివారం నిరసన చేపట్టారు. నాయకులు మాట్లాడుతూ.. ప్రభుత్వం రుణమాఫీ అమలులో భాగంగా రూ.2లక్షల లోపు రైతు రుణాలను మాఫీ కోసం ఆదేశాలు జారీ చేసినప్పటికీ రేషన్‌కార్డు ఆధారంగా కుటుంబాన్ని యూనిట్‌గా పరిగణించడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారని వెల్లడించారు. నిన్నటి వరకు రూ.లక్షన్నర లోపు అదే పరిస్థితి ఉందని దీంతో రైతులు అయోమయానికి గురై నిత్యం బ్యాంకులు, వ్యవసాయ అధికారుల కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితులు దాపరించాయన్నారు. కార్యక్రమంలో రాజన్న, ప్రసాద్, నర్సింహ, నాగరాజు, రంగారెడ్డి పలువురు పాల్గొన్నారు.

రుణమాఫీ కాక రైతుల ఆందోళన

వీపనగండ్ల: ప్రభుత్వం ప్రకటించిన రుణమాఫీ జాబితాలో కొందరి రైతులు పేర్లు లేకపోవడంతో వారు ఆందోళన చెందుతున్నారు. భార్యాభర్తలు కలిపి రూ.2 లక్షలకు పైగా రుణం తీసుకుంటే రూ.2లక్షలు మాఫీ చేసి మిగతా డబ్బులు చెల్లించాలని చెప్పిన ప్రభుత్వం, తీరా రూ.2 లక్షల పైబడిన రైతుల రుణం వివరాలను బ్యాంకు అధికారులకు, వ్యవసాయ అధికారులకు తెలియజేయకపోవడంతో పలువురు రైతులు వ్యవసాయ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు.

హామీల అమలుకై పోరాటం కొనసాగించాలి

పాన్‌గల్: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీల అమలుకై పోరాటం కొనసాగించాలని సీపీఐ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు రమేష్ అన్నారు. శనివారం మండలంలోని వెంగళాయిపల్లిలో పార్టీ కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఆరు గ్యారంటీల్లో ఇంకా అమలు కానీ పథకాలను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలన్నారు. ప్రజలు ఇళ్ల స్థలాలు, ఇంటి నిర్మాణాలు, రేషన్ కార్డులు, పింఛన్ల మంజూరు కోసం ఎదురు చూస్తున్నారన్నారు. ప్రభుత్వం అమలు చేసిన రుణమాఫీ గందరగోళంగా తయారైందన్నారు. చాలా మంది రైతులకు అర్హత ఉన్న మాఫీ కాలేదన్నారు. రుణమాఫీ కానీ రైతుల వివరాలను గ్రామాల వారీగా సేకరించి ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో కాకం బాలస్వామి, మల్లెపు బాలస్వామి, సహదేవుడు, రామకృష్ణ, వెంకటయ్య, నర్సింహ, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కార్యవర్గ సభ్యుడు రమేష్

సూచిక బోర్డుకే పరిమితమైన మైదానం

అమరచింత: గత ప్రభుత్వం గ్రామానికో క్రీడామైదానం ఏర్పాటు చేయడంతో అవి గ్రామంలోని క్రీడాకారులకు ఏమాత్రం ఉపయోగపడే విధంగా లేవు. మండలంలోని పాంరెడ్డిపల్లెకు మంజూరైన మైదానంను గ్రామంలో స్థలం లేకపోవడంతో సమీపంలోని కేజీబీవీ పాఠశాల విద్యార్థులకు ఉపయోగ పడుతుందని అక్కడ ఉన్న ప్రభుత్వ స్థలంలో ఏర్పాటు చేశారు. క్రీడా మైదానం అని బోర్డు పెట్టి వదిలేశారే తప్పా వాటిలో క్రీడా పరికరాలు అమర్చలేదు. కనీసం విద్యార్థులు ఆడుకుందామని అనుకున్నా మైదానం అపరిశుభ్రంగా ఉండటంతో విద్యార్థులు పాఠశాల కాంపౌండ్‌లోనే ఆటలాడుకుంటున్న పరిస్థితులు దాపరించాయి. ఇప్పటికైన అధికారులు స్పందించి వినియోగంలోకి తీసుకురావాలని కోరుతున్నారు.



నిరుపయోగంగా ఉన్న క్రీడా మైదానం

డివైడర్‌ను ఢీకొన్న కారు

పెబ్బేరు రూరల్: పట్టణంలోని పీజేపీ క్యాంపు వద్ద కారు అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొన్న ఘటన శనివారం సాయంత్రం చోటు చేసుకుంది. స్థానికుల తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీరంగాపురం, కొల్లాపూర్ చెందిన వ్యక్తులు కారులో కర్నూల్ వెళ్లి వస్తున్నారు. ఈ క్రమంలో పట్టణంలోని పీజేపీ క్యాంపు వద్ద కారు అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో ఐదుగురికి స్వల్ప గాయాలు కాగా, వారిని ఆస్పత్రికి తరలించినట్లు స్థానికులు తెలిపారు.

పెచ్చులూడుతున్న వాటర్ ట్యాంకు

అమరచింత: పట్టణంలోని దశమికట్ట సమీపంలోని ఓవర్ హెడ్‌ట్యాంక్ ప్రస్తుతం పెచ్చులూడుతుంది. 30ఏళ్ల కిందట నిర్మించిన ఈ ట్యాంక్ శిథిలావస్థకు చేరుకున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ట్యాంక్ ద్వారా నిత్యం 1.50 లక్షల లీటర్ల నీటిని సరఫరా చేస్తున్న అధికారులు, వీటిని ఏళ్ల తరబడి శుభ్రం చేయలేకపోతున్న పరిస్థితులు దాపురించాయి. ట్యాంక్ పైభాగం వెళితే ఎక్కడ కూలుతుందో అన్న భయంతో వాటర్ మెన్‌లు సాహసం చేయలేకపోతున్నారు. అధికారులు స్పందించి వాటర్ ట్యాంక్‌ను తొలగించి కొత్తది నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.





శిథిలావస్థకు చేరిన వాటర్‌ట్యాంక్, పెచ్చులూడి ఇనుప చువ్వలు బయటికి వచ్చిన పిల్లర్

రైతుల నిరాహార దీక్షకు సీపీఐ మద్దతు



రైతుల దీక్ష శిబిరం వద్ద మాట్లాడుతున్న నాయకులు

పెబ్బేరు రూరల్: వనపర్తి మండలంలోని రాజనగరం సింగిల్‌విండో వద్ద శనివారం రైతులు చేపట్టిన నిరాహార దీక్షకు సీపీఐ వనపర్తి పట్టణ కార్యదర్శి రమేష్, గోపాలకృష్ణ, శ్రీహరి దీక్షా శిబిరాన్ని సందర్శించి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 184 మంది రైతులకు అసలు మాత్రమే రుణమాఫీ చేసి, వడ్డీ చేయకపోవడంతో 52 మంది మందికి అర్హులైన రైతుల పేర్లు జాబితాలో గల్లంతయ్యాయన్నారు. దీక్ష వద్దకు చేరుకున్న డీసీఓ హరిప్రసాద్, ఏఓ కురుమయ్యతో పరిస్థితిపై చర్చించారు. అర్హులైన రైతుందరికి మాఫీ చేయాలని, లేదంటే రైతుల పక్షాన నిలబడి న్యాయం జరిగేదాక సీపీఐ పోరాడుతుందని హెచ్చరించారు. విండో వైస్ చైర్మన్ బాలచంద్రయ్య, కృష్ణయ్య, రైతులు తదితరులు పాల్గొన్నారు.